# INDIAN MEDICAL ASSOCIATION & BEZWADA MEDICAL ASSOCIATION
VIJAYAWADA

*IMA PUBLIC EDUCATION HANDOUT SERIES NO. 9*


# టైఫాయిడ్

జూలై, ఆగస్టు నెలలు వస్తే చాలు వర్షాలు, వాటితో ఈగలు, దోమలు – వీటి వలన వచ్చే ఫ్లూ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్ జ్వరాలు బయటపడతాయి. వీటి వలన ప్రజారోగ్యం మీద తీవ్ర ప్రభావం కలగడమే కాక ఆర్థికంగా కూడా ప్రజల మీద, ప్రభుత్వం మీద భారం పడుతోంది. ఈ జ్వరాలలో ముఖ్యమైన టైఫాయిడ్ జ్వరం గురించి తెలుసుకోవటం చాలా అవసరం.

**టైఫాయిడ్ దేనివలన వస్తుంది?**

ఇది సాల్మోనెల్లా టైఫి అనే సూక్ష్మక్రిమి వలన కలిగే అంటువ్యాధి. టైఫాయిడ్ కేవలం మానవుడికే పరిమితమైన వ్యాధి. మనిషి నుంచి మనిషికి కలుషితమైన ఆహారం, నీరు వలన, పరిశుభ్రత లోపించడం వలన వ్యాపిస్తుంది.

**టైఫాయిడ్ ఎప్పుడు ఎక్కువగా కన్పిస్తుంది?**

సంవత్సరంలో ఏ కాలంలోనైనా టైఫాయిడ్ రావచ్చు కానీ జులై – సెప్టెంబర్ మధ్య, అంటే వర్షాకాలంలో దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

**ప్రపంచ వ్యాప్తంగా టైఫాయిడ్ :**

ప్రపంచంలో ఎక్కడైనా నీటి కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు, పారిశుధ్యంలో తేడా ఉన్నప్పుడు టైఫాయిడ్ బయటపడుతూ ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ దేశంలోనైనా టైఫాయిడ్ కేసుల సంఖ్యని బట్టి ఆ దేశపు పారిశుధ్యం గురించి తేలికగా అంచనా వేయవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇది ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 60 లక్షల మంది దీనికి గురౌతుంటే 6 లక్షలమంది కన్నా ఎక్కువ మందే మరణిస్తున్నారు. దురదృష్టమేమంటే ఇందులో 80 శాతం మరణాలు మన ఆసియా ఖండంలోనే సంభవిస్తున్నాయి.

**భారతదేశంలో టైఫాయిడ్ :**

మనదేశంలో టైఫాయిడ్ అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. 1995వ సంవత్సరంలో మూడు లక్షల పైచిలుకు టైఫాయిడ్ కేసులు నమోదైనాయి. ఇందులో 672 మంది మరణించారు.

**ఎవరికి వస్తుంది? ఎలా వ్యాపిస్తుంది?**

ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు, కానీ రెండేళ్ళలోపు పిల్లలలో తక్కువగా కనిపిస్తుంది. టైఫాయిడ్ వచ్చిన వారిలో జ్వరానికి గురైన వారిని వ్యాధి పీడితులుగాను, జ్వరం రాకుండా టైఫాయిడ్‌ను వ్యాప్తి చేసే వారిని వాహకులు (Carriers) గాను వ్యవహరిస్తూ ఉంటారు. ఈ వాహకులు ఒకసారి జ్వరానికి గురై తగ్గిన వారు కూడా అయి ఉండవచ్చు. ఈ రెండవ రకం వారు (Chronic Carriers) సంవత్సరాల తరబడి టైఫాయిడ్‌ను ఇతరులకు సంక్రమింపజేస్తూ ఉంటారు.

టైఫాయిడ్ వ్యాధి యొక్క మూల కారకాలు విసర్జన పదార్థాలు (మలము, మూత్రము) వీటివలన కలుషితమైన నీరు, ఆహారము. ఇంకా ఈగలు, అపరిశుభ్రమైన చేతుల ద్వారా కూడా ఈ క్రిమి వ్యాపిస్తుంది.

**పరిసరాలలో ఇది ఎక్కడ ఉంటుంది?**

మనిషి శరీరం బయట ఈ టైఫాయిడ్ క్రిములు నీటిలోను, ఆహారంలోను, ఐసులోను, పాలలోను, నేలలో కూడా బ్రతికి ఉంటాయి. నీటిలో 2 రోజుల నుంచి 7 రోజులపాటు, ఐస్ మరియు ఐస్‌క్రీమ్‌లలో నెలరోజుల వరకూ, ఎరువు చల్లిన తడినేలలో రెండు నెలల పైచిలుకు వరకూ టైఫాయిడ్ క్రిములు జీవించి ఉండగలవు. మలమూత్ర విసర్జనతో కలుషితమైన నీటిలో ఈ క్రిములు ఎక్కువ రోజులు జీవించి ఉండటమే కాక అట్టి కలుషిత నీటితో పెరిగిన కాయగూరలలో కూడా ఈ క్రిములు వృద్ధి చెందుతాయి. పాల రుచి, రంగు, వాసనలలో ఎట్టి మార్పు తీసుకురాకుండా టైఫాయిడ్ క్రిములు వృద్ధి చెందుతాయి.

**టైఫాయిడ్ జ్వరం - లక్షణాలు :**

కలుషితమైన నీరు, ఆహారం తీసుకున్న తర్వాత సాధారణంగా 7 నుంచి 14 రోజులలో టైఫాయిడ్ లక్షణాలు బయట పడతాయి. కానీ తీసుకున్న ఆహారం యొక్క కలుషితత్వం తీవ్రతనుబట్టి శరీర ఆరోగ్యాన్ని బట్టి 3 రోజులలోనే జ్వరం బయట పడవచ్చు. క్రమేణా పెరిగే జ్వరము, తలనొప్పి, వాంతులు, ముందు విరేచనాలు, తర్వాత మలబద్ధకం, కడుపునొప్పి, ఉబ్బరం – ఇవి మొదటి వారంలో కనిపిస్తే, రెండో వారం నుంచీ టైఫాయిడ్ వలన వచ్చే తీవ్ర పరిణామాలు (Complications) బయటపడతాయి. ఇవి దగ్గు, కఫం అంటే బ్రాంకైటిస్, న్యుమోనియాలు, పేగుపూత, ఆ పైన పేగు చిల్లుపడి రక్తస్రావం అవడం, పొట్ట ఇన్ఫెక్షన్ (పెరిటోనైటిస్) రావడం, గుండెబలహీనపడడం (మయోకార్డైటిస్), లివర్ వాయడం, మెదడువాపు, ఎముకలలో, కీళ్లలో చీము చేరడం, జుట్టు రాలిపోవడం ఇటువంటివి.

తగిన సమయంలో తగిన మందు వాడకపోతే మూడు వారాలపాటు జ్వరం బాధ పెడుతుంది. జ్వరం తగ్గాక కూడా ఒకటి నుంచి ఆరు వారాలలో మళ్ళీ తిరగబెట్టే అవకాశాలు ఎక్కువ.

**మరి చిన్న టైఫాయిడ్?**

సాధారణంగా చిన్న టైఫాయిడ్‌గా చెప్పుకునేది సాల్మనెల్లా పారాటైఫి 'ఎ' లేదా 'బి' క్రిముల వల్ల వస్తుంది. దీనిలో జ్వరం, తలనొప్పి వంటి టైఫాయిడ్ లక్షణాలు తక్కువ స్థాయిలో ఉండటమే కాకుండా టైఫాయిడ్‌లో ఉండే తీవ్ర పరిణామాలు కనిపించవు.

**గుర్తించడం ఎలా?**

(i) మొదటివారంలో జాగ్రత్తగా చేయగలిగితే రక్తం కల్చర్ పరీక్షలో టైఫాయిడ్ ఉన్నట్లు 75 శాతం మందిలో గుర్తించవచ్చును. కాని మిగిలిన 25 శాతంలో టైఫాయిడ్ ఉన్నప్పటికీ కల్చర్ పరీక్షలో ఏమీ తెలియక పోవచ్చు.

(ii) మొదటి వారంలోనే ఎముక మజ్జను (Bone Marrow) కల్చర్ చేసినా టైఫాయిడ్ తెలుస్తుంది కానీ ఇది కష్టమైన పరీక్ష.

(iii) అందరికీ తెలిసిన వైడాల్ పరీక్ష – రెండవ వారం తరువాతనే పాజిటివ్ వస్తుంది. త్వరపడి మొదటి వారంలో చేయించడం దండగ. కొంతమందిలో జ్వరం, ఇతర లక్షణాలు లేకుండా వైడాల్ పాజిటివ్ రావచ్చు (False Positive) ఇటువంటి వారు డాక్టర్ సలహా లేకుండా మందులు వాడరాదు.

(iv) రెండవ వారంలో మలమూత్రాలు కల్చర్ పరీక్ష చేయించడం వలన కూడా టైఫాయిడ్‌ను గుర్తించవచ్చు.

**టైఫాయిడ్ – చికిత్స :**

అనుభవం లేని వ్యక్తుల వైద్యం వలన, స్వంతవైద్యం వలన, సరైన ఆంటీబయాటిక్ సరైన మోతాదులో ఇవ్వకపోవడం వలన టైఫాయిడ్ చికిత్స నానాటికీ కష్టతరమౌతోంది. తక్కువ మోతాదులో మూడు, నాలుగు రోజులు మందులు వాడి జ్వర తీవ్రత తగ్గగానే ఆపేయడం వలన వివిధ రకాల ఆంటీ బయాటిక్‌లకు లొంగని టైఫాయిడ్ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టైఫాయిడ్) ఇప్పుడు మహమ్మారిలా వ్యాపిస్తోంది.

పూర్వం క్లోరంఫెనికాల్ 10–14 రోజుల వరకు వాడితే చక్కటి చికిత్సగా ఉండేది. కానీ దీనికి రక్తం మీద ఎముక మజ్జ మీద విలక్షణాలు కలిగించే గుణం ఉండడం వలన దీని వాడకం తగ్గింది.

ఆంపిసిల్లిన్, అమాక్సీసిల్లిన్, కోట్రైమాక్సజోల్, ఫ్యురజోలిడిన్ వంటి మందులు 10 నుంచి 14 రోజులపాటు వాడితే కూడా టైఫాయిడ్ తగ్గుతుంది.

అయితే, ఇప్పుడు చెప్పిన మందులకు తగ్గని టైఫాయిడ్ క్రిములు భారతదేశంలో విస్తృతంగా టైఫాయిడ్ జ్వరానికి కారణమవుతున్నాయి. అందువలన గత కొద్ది సంవత్సరాలుగా సిప్రోఫ్లాక్ససిన్, ఓఫ్లాక్ససిన్ వంటి మందులు వాడాల్సి వస్తున్నది. ఇవి 10–14 రోజుల పాటు, జ్వరం తగ్గిన తర్వాత కూడా 5 రోజుల వరకూ వాడితే టైఫాయిడ్ పూర్తిగా తగ్గిపోతుంది.

తీవ్రమైన జ్వరం ఉండి, పై మందులకు లొంగనప్పుడు మూడవ తరం సెఫలోస్పోరిన్ మందులు ఇంజక్షన్ ద్వారా 7 నుంచి పదిరోజుల పాటు ఇవ్వవలసి ఉంటుంది.

జ్వరం ఉన్నప్పుడు పారాసిటమాల్ వాడవచ్చు.

**టైఫాయిడ్ – పథ్యం :**

మెత్తగా ఉండి, త్వరగా జీర్ణమై, పోషక విలువలు కలిగి ఉన్న ఆహారం రోగి నీరసించి పోకుండా కాపాడుతుంది. అనవసర పథ్యాలు చేయించి, లంకణాలు చేయించటం వలన జ్వరం ఎక్కువ రోజులు ఉండిపోతుంది. తరచుగా గోరు వెచ్చని నీరు పుక్కిలించి ఉమియడం, సరిపోయినంతగా ద్రవపదార్థాలు తీసుకోవడం, మలబద్ధకం లేకుండా చూసుకోవడం చాలా అవసరం.

**ఆసుపత్రిలో చేర్చడం – ఎప్పుడు?**

పొట్ట ఉబ్బటం, వాంతులు, మలంలో రక్తం పడటం, మెదడువాపు లక్షణాలు, కీళ్ళవాపు, పేగు చిల్లు పడటం, గుండె బలహీనపడటం ఇటువంటి దుర్లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిలో చేర్చి నిపుణుల సలహాపై చికిత్స ఇప్పించటం అత్యవసరం.

**టైఫాయిడ్ – నివారణ :**

టైఫాయిడ్ వచ్చినప్పుడు చికిత్సకన్నా రాకుండా నివారించటం అతిముఖ్యం, తేలిక కూడా. అపరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోకుండా ఉండాలి. విసర్జన పదార్థాలు (మలం, మూత్రం) సరైన పద్ధతిలో నిర్మూలించాలి. మలమూత్ర విసర్జన తరువాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఆహారం తయారుచేసే పద్ధతి, వడ్డన పరిశుభ్రంగా ఉండాలి. ఆహారాన్ని తాకేటప్పుడు కూడా అన్ని వేళలలో అందరూ చేతులు చక్కగా శుభ్రపర్చుకోవటం శ్రేయస్కరం.

**టైఫాయిడ్ - టీకాలు :**

టైఫాయిడ్ జ్వరం నివారణలో అతిముఖ్య విషయం వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత కాగా, ఈనాడు మూడు రకాలైన టైఫాయిడ్ టీకాలు (వాక్సిన్‌లు) లభ్యమౌతున్నాయి.

**(1) కిల్డ్ వాక్సిన్ (టి.ఎ.) (T.A. Vaccine) :**

అతి పురాతనమైనది. 6 నుండి 9 నెలలు దాటిన పిల్లలకు ఇవ్వవచ్చును. డోస్ : 4 వారాల వ్యవధిలో రెండు మోతాదులు : ప్రతిసారి 0.5 మి.లీ. (10 ఏళ్ళ పైవారికి), 0.25 మి.లీ. (10 ఏళ్ళ లోపు పిల్లలకి). మందు చర్మము క్రింద ఇంజెక్షన్ ద్వారా ఇవ్వాలి. ఇంజెక్షన్ ఇచ్చిన చోట నొప్పి, జ్వరం మొ॥వి తరచుగా ఉంటాయి.

**(2) నోటీద్వారా తీసుకునే క్యాప్సుల్ వాక్సిన్ :**

**Ty 21a** అనే వాక్సిన్ ఇప్పుడు క్యాప్సుల్ రూపంలో లభిస్తున్నది. ఇంజెక్షన్ అంటే ఇష్టం లేని వారికిది చక్కని ప్రత్యామ్నాయం. అయితే ఇవి కేవలం 6 సం॥లు దాటిన పిల్లలకు మాత్రమే వాడాలి. డోసు : రోజు విడిచి రోజు ఒక క్యాప్సుల్ చొప్పున మొత్తం మూడు క్యాప్సుల్స్ వాడాలి. క్యాప్సుల్స్‌ను రిఫ్రిజరేటర్‌లోనే ఉంచాలి.

**(3) Vi కాప్సులర్ పాలీశాఖరైడ్ వాక్సిన్ :**

రెండు సంవత్సరాలు దాటిన పిల్లలందరకు వేయదగిన ఇంజెక్షన్ రూపంలో ఇచ్చే నూతన వాక్సిన్ ఇది. టి.ఎ. వాక్సిన్ వలె కాక దీనికి జ్వరం వంటి దుష్పరిణామాలు చాలా తక్కువ. డోసు : 0.5 మి.లీ. కండలోకి లేదా చర్మము క్రింద ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు.

ఏ వాక్సిన్‌కు అయినా లబ్ది సుమారు 60 నుంచి 70 శాతం మాత్రమే. ప్రతి మూడు సంవత్సరాలకు డోసు మరల తీసుకోవాలి.

**టైఫాయిడ్‌ను గురించి గుర్తుంచుకోవల్సిన అంశాలు :**

1. ఇది మానవులలో మాత్రమే వ్యాపించే అంటువ్యాధి.
2. కేవలం వ్యక్తిగత, పరిసరాల అపరిశుభ్రత వలన ఇది వ్యాప్తి చెందుతుంది.
3. కలుషితమైన ఆహార పదార్థాలు, నీరు, పాలు, చివరకు ఐస్‌క్రీమ్‌లలో కూడా ఈ క్రిములు వృద్ధి చెందుతాయి.
4. బహిరంగ మలమూత్ర విసర్జన టైఫాయిడ్ వ్యాప్తికి ముఖ్యకారణం.
5. మలమూత్ర విసర్జన తరువాత, ఆహారాన్ని తాకేముందు చేతులను చక్కగా శుభ్రం చేసుకోవడం వలన టైఫాయిడ్‌ను తేలికగా నిరోధించవచ్చు.
6. ప్రతి జ్వరం టైఫాయిడ్ కాదు. టైఫాయిడ్‌గా గుర్తించిన తర్వాత మాత్రమే సరైన మోతాదులో, సరైన మందు తగు వైద్య సలహాతో వాడాల్సి ఉంటుంది.
7. టైఫాయిడ్ రాకుండా ఇంజెక్షన్ రూపంలోను, కాప్సిల్ రూపంలో కూడా టీకాలు లభ్యమవుతున్నాయి. వీటి ద్వారా లభించే భద్రత 70 శాతం లోపే అయినా ధరను భరించగలిగిన వారు తీసుకోవడం మంచిది.
8. టైఫాయిడ్ తీవ్ర పరిణామాలు (Complications) సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయిస్తే మరణాలు నిరోధించవచ్చు.

***